విస్తృతంగా మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ

శంషాబాద్: రేపటి తరానికి మంచి భవిష్యత్తు ఇవ్వడానికి విస్తృతంగా మొక్కలు నాటాలని శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మా అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అకాంప్లిష్ కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పచ్చదనం..పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధచూపుతున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బండి గోపాల్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ బి. సుమన్‌రావు, కౌన్సిలర్ పుష్పలత, హెల్త్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్

అత్తాపూర్: సీసీ రోడ్డు పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్ అన్నారు. అత్తాపూర్ డివిజన్‌లోని హైదర్‌గూడ సిరిమల్లె నగర్ కాలనీలో శుక్రవారం బాపుఘాట్ బ్రిడ్జికి వెళ్లే ప్రధాన రహదారి సీసీ రోడ్డు అభివృద్ధి పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సిద్దేశ్వర్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకండి



పారిశుద్ధ్య కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్

మణికొండ: ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేయవద్దని మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా 12వ వార్డులో ఉన్న అనంత పద్మనాభస్వామి దేవాలయం ఆవరణలో చెత్తా చెదారాన్ని తొలగించారు. త్వరలో దేవాలయ ఆవరణలో డస్ట్‌బిన్లను ఏర్పాటు చేస్తానన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్వేతకిరణ్‌కుమార్, డి. పురుషోత్తం, డీఈ దివ్యజ్యోతి, శానిటేషన్ ఇంచార్జి సంపత్, సిబ్బంది పాల్గొన్నారు.

'త్వరలో రుణమాఫీ'



డీసీసీబీ డైరెక్టర్‌గా ఎన్నికైన మోహన్‌రావును సన్మానిస్తున్న సొసైటీ పాలకవర్గం సభ్యులు

శంషాబాద్ రూరల్: చిన్నగోల్కొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వ సభ్య సమావేశం సొసైటీ చైర్మన్ బి.దొనాకర్‌గౌడ్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. రుణమాఫీ కాని రైతులకు త్వరలోనే మాఫీ అవుతుందన్నారు. మాఫీ అయిన రైతులకు కొత్తగా రుణాలు అందజేశామన్నారు. మోహన్‌రావు డీసీసీబీ డైరెక్టర్‌గా ఎన్నిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు.

డీసీసీబీ డైరెక్టర్‌గా మోహన్‌రావు ఎన్నిక



ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసిన డీసీసీబీ డైరెక్టర్ మోహన్‌రావు

శంషాబాద్ రూరల్: హైదరాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్(డీసీసీబీ) డైరెక్టర్‌గా చిన్నగోల్కొండ సొసైటీ డైరెక్టర్ మంచర్ల మోహన్‌రావు నియమితులయ్యారు. డీసీసీబీ అధ్యక్షుడు కొత్త కుర్మ సత్తయ్య అధ్యక్షతన జరిగిన పాలకవర్గం సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా మోహన్‌రావు శుక్రవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పి.కార్తీక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా పేరుతో కూల్చివేతలు ఆపాలి



క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న లక్ష్మీనగర్ వాసులు

అత్తాపూర్: నిబంధనలను లోబడి అనుమతులు తీసుకున్న ఇంటి నిర్మాణాలను, అపార్ట్‌మెంట్లను హైడ్రా పేరుతో కూల్చివేసే కార్యక్రమాన్ని ఆపాలని అత్తాపూర్ లక్ష్మీనగర్ వాసులు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనగర్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు నవీన్ కుమార్ మాట్లాడుతూ.. హైడ్రా పేరుతో తీసుకున్న నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కి తీసుకునేంత వరకు తాము పోరాడతామన్నారు. బఫర్ జోన్‌లో నిర్మాణాలు చేపట్టలేదని రైతుల పట్టా భూములు, వ్యవసాయ క్షేత్రంలోనే అన్ని రకాల అనుమతులతో మూసీ నదికి దూరంలోనే నిర్మాణాలు చేపట్టామన్నారు. కూల్చివేత కార్యక్రమం జరిగితే 750 కుటుంబాలు నిరాశ్రయులవుతారన్నారు. కార్యక్రమంలో పెరల్ హైట్స్ అపార్ట్‌మెంట్స్, సిలికాన్ నందనవనం రెడ్జ్, అంబియన్స్ పోర్టు వాసులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు కొండా లక్ష్మణ్

స్వాతంత్య్ర ఉద్యమం చేయడంతోపాటు నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని పలువురు వక్తలు కొనియాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలో పలుచోట్ల కార్యక్రమాలు జరిగాయి. తెలంగాణ విమోచనోద్యమంలో పోరాడి పౌర హక్కులపై తీవ్ర నిర్బంధం కొనసాగుతున్న రోజుల్లో ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు.



కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులు అర్పించిన మణికొండ మున్సిపల్ చైర్మెన్,కమిషనర్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు



పోలీస్ అకాడమీలో..

మణికొండ: రాష్ట్ర సాధనకు నిరంతరం పోరాటం చేయడంతో పాటు తన ఆస్తులను సైతం ధారాదత్తం చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మణికొండ మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ కె.నరేందర్ ముదిరాజ్, కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్‌లు మాట్లాడుతూ తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని వెలుగెత్తి చాటి సమాజాన్ని ఐక్యం చేసిన వ్యక్తి లక్ష్మణ్ బాపూజీ అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మెన్ కె. నరేందర్‌రెడ్డి, డీఈ దివ్యజ్యోతి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఏజీవర్సిటీ: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవాలు శుక్రవారం శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బాపూజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉద్యాన విశ్వవిద్యాలయం, వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అకాడమీలోని సెమినార్ హాల్‌లో బాపూజీ చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు జాయింట్ డైరెక్టర్ డి.మురళీధర్, డిప్యూటీ డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, నర్మద, సునీతామోహన్, అసిస్టెంట్ డైరెక్టర్లు, పాల్గొన్నారు.



శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో..



ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో..

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పనులను పరిశీలిస్తున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి

బండ్లగూడ: ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించినప్పుడే ఆరోగ్యవంతంగా జీవిస్తారని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డితో కలిసి హిమాయత్‌సాగర్ జలాశయం వద్ద పారిశుద్ధ్య పనుల్లో పాల్గొన్నారు. అనంతరం కమిషనర్ శరత్‌చంద్ర ఆధ్వర్యంలో శుభ్రత కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముద్దం రాము, ప్రశాంత్‌నాయక్, డిప్యూటీ ఈఈ యాదయ్య పాల్గొన్నారు.

భర్త వేధింపులు భరించలేక భార్య ఆత్మహత్య

మైలార్‌దేవ్‌పల్లి : భర్త వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చేసుకుంది.ఎస్‌ఐ సత్యకుమార్ తెలిపిన మేరకు.. మధుబన్ కాలనీలో ముఖేష్ భాతి(32) పూజాబాతి(31) దంపతులు నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. వీరితో పాటు అత్తా మామలు ఉంటున్నారు. పూజాబాతి తల్లిదండ్రులు రోడ్డుకు అవతలి వైపు నివాసముంటున్నారు. ఇదిలా ఉండగా ముఖేష్ భాతి రోజూ భార్యను వేధిస్తూ నరకం చూపేవాడు. గంజాయి, డ్రగ్స్, మద్యం మత్తులో భార్యను హింసించేవాడు. అనుమానంతో భార్యను ఇంట్లో ఉంచి తాళం వేసి వెళ్లేవాడు. వేధింపులు ఎక్కువ కావడంతో పూజ పుట్టింటికి వెళ్లింది. అయితే ఆమెను నమ్మించి ఇంటికి తీసుకువచ్చాడు.అయినా వేధింపులు మానలేదు.



పూజా (ఫైల్)



నిందితుడు ముఖేష్

దీంతో గురువారం రాత్రి 9 గంటల ప్రాంతంలో ఇంట్లో పూజాబాతి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో భర్త పరారయ్యాడు. పోలీసులు గాలించి పట్టుకొని అరెస్టు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మహావీర్ కళాశాలలో మెగా జాబ్ మేళా

మైలార్‌దేవ్‌పల్లి: బండ్లగూడలోని మహావీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ సంరెడ్డి ప్రమోద్‌రెడ్డి తెలిపారు. జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్,స్కైఐఎంఎఫ్ ,అపోలో ఫార్మసి, సాఫ్ట్ సొల్యూషన్, ఫ్లిప్ కార్ట్, ముత్తూట్ తదితర కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. రూ. 300 చెల్లించి స్పాట్ రిజిష్టర్ చేసుకోవాలని తెలిపారు.

30 నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు



వెంకటేశ్వర కాలనీలో నిర్మించిన గాయత్రి మాత దేవాలయం

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వేంకటేశ్వర కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ గాయత్రిదేవి, శ్రీ మహాసర స్వతి, మహా గణపతి, శ్రీ సుబ్రమణ్య, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ పూజలను ఈనెల 30 నుంచి అక్టోబర్ 4 వరకు కొనసాగుతాయని ఆలయ కమిటీ చైర్మెన్ బి. ఉపేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ప్రతి రోజూ పూజలు, హోమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత కార్యక్రమాలు ఉంటాయన్నారు.

నేడు సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలో డైరీ ఫార్మ్ గోల్డెన్ హైట్స్ కాలనీ ఫేజ్–2లో శనివారం ఉదయం 10 గంటలకు సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నాయకులు బొక్క ప్రభాకర్ రెడ్డి, పలుగు చెరువు మహేశ్‌లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ హాజరవుతారన్నారు.

ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపాలి



హిమాయత్‌సాగర్ నుంచి మూసీ పరీవాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నాయకులు

బండ్లగూడ: గండిపేట మండల పరిధిలోని గండిపేట, హిమాయత్‌సాగర్ మూసీ నాలాలను సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యులు డి.జగదీష్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనేక సంవత్సరాల నుంచి మూసీ ఇరుపక్కల ఇళ్లను నిర్మించుకొని పన్నులు చెల్లిస్తూంటే ఇపుడు భయపెడుతున్నారన్నారు. ఇళ్లను కోల్పోయే వారికి ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ జాజుల రుద్రకుమార్, రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జి.కురుమయ్య, పాల్గొన్నారు.

పర్యాటక, ఆతిథ్యరంగాలలో
ఉపాధి అవకాశాలు మెండు



గచ్చిబౌలిలోని నిథమ్‌లో నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న పర్యాటక శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులు

- మంత్రి జూపల్లి కృష్ణారావు
- 'నిథమ్'లో అట్టహాసంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం

రాయదుర్గం: రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. శుక్రవారం నిథమ్‌లో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ పర్యాటక, ఆతిథ్యరంగాలలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఈ రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అనంతరం యువ టూరిజమ్ క్లబ్స్ ద్వారా తెలంగాణ పర్యాటకాన్ని ప్రోత్సహిస్తూ సంస్కృతి, వారసత్వ పరిరక్షణ, పర్యాటకంలో యువతకు ఉపాధి కల్పనలో విశేష కృషి చేసిన మహబూబ్ నగర్, వరంగల్, జగిత్యాల జిల్లాల కలెక్టర్లు, పర్యాటకులకు ఆతిథ్యరంగంలో విశేష కృషి చేస్తున్న రెస్టారెంట్లు, హోటల్ నిర్వాహకులకు ప్రోత్సాహంగా అవార్డులను అందించి సత్కరించారు. పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, పర్యాటక శాఖా ముఖ్య కార్యదర్శి. వాణి ప్రసాద్ చేతుల మీదుగా అవార్డులను అందించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, టూరిజమ్ డైరెక్టర్ ఇలా త్రిపాఠి, భాషా సంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, బాక్సర్ నిఖత్ జరీనా, సింగర్ సాకేత్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు...

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని నిథమ్ ప్రాంగణంలోని ఆంపీ థియేటర్‌లో విద్యార్థినులు, కళాకారుల నృత్య ప్రదర్శనలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా శివప్రియం, కాకతీయం, కూచిపూడి,పేరిణి నృత్య రూపాలు అందరినీ అలరించాయి.





నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: హిమాయత్‌సాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

- పీఅండ్‌టీ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 11.30 వరకు పీఅండ్‌టీ కాలనీ, ఏ,బీ,సీ,డీ స్పెషల్ బ్లాక్స్ ప్రాంతాల్లో..
- హైదర్షాకోట్ ఫీడర్ పరిధిలో 11.30 నుంచి 12 గంటల వరకు వేంకటేశ్వర కాలనీ, డైమండ్ వ్యాలీ, ప్రశాంత్‌నగర్, తిరుమల గార్డెన్, పావని హార్మనీ విలాస్, బచ్‌పన్ స్కూల్, పద్మశ్రీహిల్స్ మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో..
- భాగ్యనగర్ ఫీడర్ పరిధిలో 12 నుంచి 12.30 వరకు నర్సారెడ్డి కాలనీ, పద్మశ్రీహిల్స్, భాగ్యనగర్ కాలనీ, రాధానగర్, కె.కె.3, రాధానగర్ ఫేస్–1, హీరా కాలనీ, ఇందిరారెడ్డి కాలనీ ప్రాంతాల్లో..
- సన్ సిటీ ఫీడర్ పరిధిలో 12.30 నుంచి ఒంటి గంట వరకు హిమగిరి కాలనీ, గంధంగూడ, హైదర్షాకోట్ గ్రామం, సన్‌సిటీ, జెయిన్స్ సల్బర్గ్, వెస్టెండ్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఈ కోత ఉంటుందన్నారు.
- మైలార్‌దేవ్‌పల్లి: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కాటేదాన్ ఏఈ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లక్ష్మిగూడ విలేజ్,హౌసింగ్‌బోర్డుకాలనీ, ఆర్‌జీకే ,వాంబే కాలనీ,బృందావన్ కాలనీ,గణేష్ నగర్‌లలో ఉదయం 10.30 నుండి 11 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

అగ్ని ప్రమాదాలు జరుగకుండా చూసుకోవాలి



అగ్నిమాపక వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్

ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

అత్తాపూర్ : అగ్నిప్రమాదాలు జరుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ ఫైర్ స్టేషన్‌లోని రెండు నూతన అగ్నిమాపక వాహనాలను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ శుక్రవారం జిల్లా ఫైర్ ఆఫీసర్ మురళి మనోహర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అగ్ని ప్రమాదాలను నివారించేందుకు అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలకు తెగించి కృషిచేస్తారన్నారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బందితో పాటు రాజేంద్రనగర్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ చంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

మైలార్‌దేవ్‌పల్లి: మధుబన్‌కాలనీలో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్‌ను అధికారులు మరమ్మతులు చేయించారు. ప్రమాదాలకు నిలయంగా మ్యాన్ హోల్ అనే శీర్షికన గురువారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. కాటేదాన్ జలమండలి డీజీఎం రేణుక, మేనేజర్ సయ్యద్ సాదిక్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ జియా,సూపర్‌వైజర్ వినయ్‌కుమార్ శుక్రవారం సిబ్బందితో మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయించారు.



మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేస్తున్న జలమండలి సిబ్బంది

సీబీఐటీలో ఓటింగ్‌పై అవగాహన

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఎన్నికల అక్షరాస్యత క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఓటింగ్ విధానాలపై అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రక్రియ, ఓటరు నమోదు, సమాచార నిర్ణయం తీసుకోవటం ప్రాముఖ్యత, ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ జీఎస్‌ఆర్ ప్రసాద్, విద్యార్థి కోఆర్డినేటర్ కౌశిక్‌చెట్టితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

డిసెంబర్ 1న కడల్స్ మిసెస్ మామ్ గ్రాండ్ ఫినాలే

- 8 నగరాల్లో నిర్వహణ.. సాధారణ ప్రసవాలపై అవగాహన
- కిమ్స్ కడల్స్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ శిల్పిరెడ్డి



కొండాపూర్ కిమ్స్ కడల్స్‌లో కడల్స్ మిసెస్ మామ్ సీజన్-8 వివరాలను వెల్లడించిన డా.శిల్పిరెడ్డి

గచ్చిబౌలి: గర్భిణులకు సాధారణ ప్రసవాల ప్రాధాన్యత అర్థమయ్యేలా చెప్పడం, సంపూర్ణ శారీరక, మానసిక ఆరోగ్యం బాగుండేలా చూడటం కోసం కిమ్స్ కడల్స్ మిసెస్ మామ్ సీజన్–8 నిర్వహిస్తున్నట్లు కిమ్స్ కడల్స్ క్లినికల్ డైరెక్టర్, గైనకాలజిస్ట్ డాక్టర్ శిల్పిరెడ్డి తెలిపారు. శుక్రవారం కొండాపూర్ కిమ్స్ కడల్స్ హాస్పిటల్‌లో కడల్స్ మిసెస్ మామ్ సీజన్–8 వివరాలను ఆమె వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భం దాల్చిన తరువాత తీసుకోవాల్సిన ఆహారం, వ్యాయామం, యోగా, పుట్టిన పిల్లల సంరక్షణపై శిక్షణ ఉంటుందన్నారు. గైనకాలజిస్ట్, పీడియాట్రిక్స్, న్యూట్రిషన్ రంగాల్లో నిపుణులైన వారు సలహాలు, సూచనలు అందిస్తారని వివరించారు. హైదరాబాద్, ఖమ్మం, సిద్ధిపేట, వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్, నల్గొండ తదితర నగరాలలో సెప్టెంబర్ 29 నుంచి కడల్స్ మిసెస్ మామ్ సీజన్–8 పోటీలు ఉంటాయన్నారు. హైదరాబాద్‌లో డిసెంబర్ 1న గ్రాండ్ ఫినాలే నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు. ఫినాలే విజేతలకు కిమ్స్ కడల్స్ ఆస్పత్రిలో ఉచితంగా ప్రసవం చేయడంతో పాటు ఇతర విజేతలకు రాయితీలు ఉంటాయన్నారు.

రెండోరోజు ఉత్సాహంగా స్టార్టప్ ఫెస్టివల్

రాయదుర్గం: ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫెస్టివల్(ఐఎస్ఎఫ్) 2024 అట్టహాసంగా సాగుతోంది. రెండవ రోజైన శుక్రవారం పలు అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశాలు ఎస్కీలో జరిగాయి. ఈ కార్యక్రమాలను ఐఎస్ఎఫ్–2024 చైర్మన్, కన్వీనర్ డాక్టర్ జేఏ చౌదరి పర్యవేక్షించారు. ముఖ్యంగా 'ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ ఇన్ ది ఏఐ ఎరా', స్టార్టప్ ఎకో సిస్టమ్ వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా ఐఎస్ఎఫ్ కన్వీనర్ డాక్టర్ జేఏచౌదరి మాట్లాడుతూ ఈ స్టార్టప్‌లకు అన్ని విధాల అండగా ఉంటామన్నారు. దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా మార్కెట్ యాక్సెస్‌తో మద్దతు ఇస్తామన్నారు.

ఎక్స్‌పోను తిలకించిన మంత్రి ఉత్తమ్, ఎంపీ భరత్..

స్టార్టప్‌ల ఎక్స్‌పోను మంత్రి ఉత్తమ్, విశాఖపట్నం ఎంపీ భరత్ తిలకించారు. అక్కడి స్టార్టప్‌లు, ఐఎస్ఎఫ్ నిర్వాహకులతో మాట్లాడి పలు అంశాలను తెలుసుకున్నారు. అనంతరం వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఇద్దరినీ నిర్వాహకులు సత్కరించారు.



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, విశాఖ ఎంపీ భరత్‌ను సన్మానించిన నిర్వాహకులు